క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో ఇంటర్మీడియెట్ ప్రశ్నాపత్రాలు



ప్రశ్నాపత్రాలను భద్రపరుస్తున్న అధ్యాపకులు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానుండడంతో మంగళవారం ప్రశ్నాపత్రాలు ఆదోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. పరీక్షల నిర్వహణలో భాగంగా ప్రశ్నపత్రాలు సెట్-ఎ, సెట్-బి వచ్చాయి. ఆయా కళాశాలలకు చెందిన అధ్యాపకులతో పరిశీలించి వాటిని పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు పరీక్షల విభాగం అధికారి కస్టోడియన్ డెవిడ్ తెలిపారు.

సింహగర్జన మహాసభను విజయవంతం చేద్దాం

ఆదోనిఅర్బన్: కర్నూలులో ఈనెల 29వ తేదీ జరగనున్న దివ్యాంగుల సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ట్రెజరర్ వీరన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ కమతం వెంకటేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆదోనిలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సాబీర్, వెంకటరావు, దాసరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మవ్వ దేవర



పూజలందుకుంటున్న దొండు మారెమ్మవ్వ

ఆదోనిటౌన్: ఆదోని మండలం నెట్టేకల్ రోడ్డు చాపమ్మవ్వ దేవాలయానికి చేరువలో వెలసిన దొండు మారెమ్మవ్వ దేవర మంగళవారం వైభవంగా జరిగింది. వందేళ్ల చరిత్ర కలిగిన దొండు మారెమ్మవ్వ చరిత్రను భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పట్టణ ప్రజలు నెమరువేసుకున్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు సున్నం బట్టి లక్ష్మన్న ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



కబడ్డీ కోర్టును పరిశీలిస్తున్న ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి

ఆదోని సెంట్రల్: పీఎంశ్రీ కింద చేపట్టిన కబడ్డీ కోర్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం పెద్దహరివాణం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సిద్ధం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఎంశ్రీ కింద మంజూరైన రూ.లక్షతో నిర్మిస్తున్న కబడ్డీ కోర్టును పరిశీలించారు. కబడ్డీ కోర్టు నిర్మాణం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాదేవి, వ్యాయమ ఉపాధ్యాయులు రామన్న ఉన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి



ఎండిమిర్చిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు: మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. పెద్దకడబూరు గ్రామ శివార్లలోని కల్లాలో ఆరబోసిన మిర్చి పంటను మంగళవారం వారు పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల అరకొరగా పండిన పంటలను రైతులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారన్నారు. గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పంటకు గిటు బాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు.


29న భజన పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి రథోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీ రాత్రి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామప్రజలు మంగళవారం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, ఆరవ బహుమతి రూ.5 వేలు నగదు అందించనున్నట్లు చెప్పారు. ఎంట్రీ ఫీజు రూ.400 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 88973 74035, 95731 32458 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

భక్తుల కొంగుబంగారం రేణుకా ఎల్లమ్మ



అమ్మవారి ఆలయం



ఉత్సవాలకు సిద్ధం చేసిన రథం

- రేపు మహా రథోత్సవం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కోసిగి: భక్తుల కొంగు బంగారం, కోసిగి ప్రజల ఆరాధ్య దైవం శ్రీరేణుక ఎల్లమ్మదేవి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం వేకువజామున నుంచే ఉథో ఉథో తాయి ఎల్లమ్మ అంటూ ఆలయ పరిసరాలు మార్మోగనున్నాయి. ఏటా మాఘ మాసం శుద్ధ పంచమి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పట్టు వస్త్రాలంకరణ, వెండికవచ అలంకరణ, మహామంగళహారుతుల గావించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. కోసిగి మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా కర్నూలు జిల్లా, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈనెల 29వ తేదీ(గురువారం) సాయంత్రం 5గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి అమ్మవారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథావిధిగా ఆలయం చెంతకు చేర్చుతారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాం



రేణుక ఎల్లమ్మ జాతరకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. తాగునీటి కోసం కొళాయిలు, బాత్‌రూమ్, టాయిలెట్స్ సౌకర్యం కల్పించాం. అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

– ఉమేష్ గౌడ, ఆలయ అర్చకుడు

తాగునీటి వసతి ఏర్పాటు



జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా 10 ట్యాంకర్లు ఏర్పాటు చేశాం. భక్తులు ఉండే ప్రాంతాల్లో నీటి వసతి ఏర్పాటు చేస్తున్నాం. అలాగే జాతరలో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూస్తాం.

– చంద్రశేఖర్, పంచాయతీ ఈఓ, కోసిగి

జాతరకు బందోబస్తు



జాతరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఆలయ ప్రాంగణం వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. భారీ వాహనాలు లోపలికి రాకుండా ఊరి చివరనే ఉండేలా చూస్తున్నాం. జాతరలో అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్, సీఐ, కోసిగి

పేదల సొంతింటి కల సాకారం



జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: ఎన్నో ఏళ్లుగా పేదలు ఎదురుచూస్తున్న సొంతింటి కల సాకారమయ్యింది. గత టీడీపీ 14 ఏళ్ల పాలనలో ఇంటి స్థలం, పక్కా ఇల్లు కోసం ప్రజలు ఎంతగానో ఎదురుచూశారు. అయితే ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. కాలనీల్లో ఇల్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు, ఇంటి స్థలం మంజూరు చేస్తూ నిర్మాణానికి సహకారం అందిస్తోంది. దీంతో ఆదోని ప్రాంత ప్రజలు తమ సొంతింటి కల జగనన్న పుణ్యమా అని నెరవేరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వం 9,655 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. అందులో 7,565 ఇళ్లను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసింది. మిగిలిన 2090 ఇళ్లను నెలాఖరులోగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఇంటి స్థలం పక్కా రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు లభిస్తున్నాయి. నియోజకవర్గంలో గ్రామ, వార్డు సచివాలయాల అడ్మిన్లు, వీఆర్వోలు పేదల చెంతకే వెళ్లి స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఈనెల 12వ తేదీన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యింది. నెలాఖరులోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయనున్నారు. జగనన్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్థవంతంగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శేషాద్రి

కౌతాళం: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీపీ అమరేష్, జెడ్పీటీసీ రాధప్రియదర్శిని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ.. నవరత్నాల పథకాలతో పేదల ఇళ్లలో వెలుగులు నింపిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. మండలంలో జరిగిన అభివృద్ధి, వివిధ పనుల గురించి ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. మండల వ్యవసాయాధికారి శేషాద్రి మాట్లాడుతూ.. గతేడాది రైతు భరోసా పథకం ద్వారా 14,200 మంది లబ్ధిపొందగా ఈ ఏడాది 15,102 మంది లబ్ధిపొందేలా చూశామన్నారు. రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాకు జమ అవుతాయన్నారు. కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించడంతో ఇన్‌పుట్ సబ్సిడీ కింద మండలంలో 17,822 మంది రైతులకు రూ.27.45 కోట్లు జమ అవుతాయని చెప్పారు. మండలంలో విద్యుత్ స్తంభాల సమస్య తీవ్రంగా ఉందని ఏఈ సర్రప్ప సరిగా స్పందించడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేవనెత్తారు. డ్యామేజ్ పోల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఎంఈఓ-2 శోభరాణి మాట్లాడారు. ఏపీఓ జుబేర్‌అహ్మద్ మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 3.18 లక్షలు పనిదినాలు కల్పించామని, ఈ సంఖ్య మార్చి నెలకు 3.80 లక్షలకు చేరుకుంటుందన్నారు. హార్టికల్చర్ 400 ఎకరాలు కాగా ప్రతి పంచాయతీకి 20 ఎకరాల వరకు టార్గెట్ ఉందని, అంతకుమించి పంటల్ని సాగుచేసుకోవచ్చన్నారు. ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. వైస్ ఎంపీపీ-1 బుజ్జిస్వామి, వైస్ ఎంపీపీ-2 లిఖిత, డిప్యూటీ తహసీల్దారు రామేశ్వర్ రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, వైద్యులు, ఏఈలు, కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులే కీలకం



మాట్లాడుతున్న ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులు, సెక్టార్ పోలీసులతో ఎన్నికల ప్రక్రియపై సబ్‌కలెక్టర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ సామగ్రి, చెక్‌లిస్ట్, హ్యాండ్ బుక్‌లు పంపిణీ చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్, ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులోకి వస్తాయన్నారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లను సందర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమై లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తెచ్చి, వసతుల కల్పన పూర్తి చేయాలన్నారు. డీటీ రజనీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ (ఇన్‌చార్జి) విజయ్‌శేఖర్, డీఎల్‌పీఓ పరిపాలనాధికారి వీరభద్రప్ప, గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీర్ రవి కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమీక్ష

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ఏదైనా సందేహాలు ఉంటే తెలపాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ కోరారు. ఆయన మంగళవారం సాయంత్రం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సౌకర్యాలు లేని కేంద్రాల స్థానంలో హేతుబద్ధీకరణలో భాగంగా ఏర్పాటైన పోలింగ్ కేంద్రాలపై ఏదైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎన్నికల సీనియర్ సహాయకులు ఖాసీం, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

పెద్దకడబూరు: మిర్చి దిగుబడిని అమ్ముకునేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మృతుల స్వగ్రామాలకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా సాయం త్వరగా అందేవిధంగా తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో భీరలింగేశ్వరస్వామి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని భీరప్పనగర్‌లో వెలిసిన శ్రీభీర లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్త నాగప్ప ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయాన్ని అభివృద్ధి చేసినందుకు ధర్మకర్త నాగప్పను కమిటీ సభ్యులు, భక్తులు పూలమాలలతో సన్మానించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

శ్రీశైల యాత్రికులకు అన్నదానం



శిబిరంలో సేదతీరుతున్న శివస్వాములు

ఆదోనిఅర్బన్: మహాశివరాత్రి పండగను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో శివభక్తులకు అన్నదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆదోని చుట్టుపక్కల, ఇతర ప్రాంతాల నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములు, భక్తులకు అన్నదానం చేపట్టారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద అల్కూరు మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి, దాతల సాయంతో భక్తులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నదానం చేస్తున్నారు. అలాగే పాదయాత్ర భక్తులు సేదతీరేలా తగిన ఏర్పాట్లు చేశారు.

ఎల్లమ్మ జాతరను ప్రశాంతంగా జరుపుకోండి



ఇరు పార్టీల నాయకులకు సూచనలు చేస్తున్న సీఐ ప్రసాద్

కోసిగి: మండలంలో ఈనెల 29వ తేదీన జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ ప్రసాద్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సతీష్ కుమార్ తో కలిసి మండలంలోని ఇరుపార్టీల నాయకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రథోత్సవం రోజున వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులకు కలిగించరాదన్నారు. జాతరలో అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్లకు పాల్పడడం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే జాతర రోజున ప్రతిఒక్కరూ పోలీసులు విధించిన ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. భారీ వాహనాలను గ్రామంలోకి అనుమతించడం లేదని, గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలుపుకోవాల్సి ఉంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ



కమిషనర్ రఘునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి బదిలీపై ప్రొద్దుటూరుకు నియమితులయ్యారు. ఆయన స్థానంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని ఆదోనికి కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కమిషనర్ రఘునాథ్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆయనకు పూలమాలలు, శాలువాలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంఈ చలపతి, టీపీఓ శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, చైర్‌పర్సన్ బి.శాంత, సచివాలయం ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు మాట్లాడారు. కమిషనర్ సేవలను కొనియాడారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కృష్ణగిరి: మండల పరిధిలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ ల్యూక్ మంగళవారం తనిఖీ చేశారు. మండల కేంద్రలోని రెండు, ఎరుకులచెరువు గ్రామంలోని రెండు, ఆగవేళిలోని ఒక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, వారికందుతున్న పోషకాహారం, రికార్డులు, స్టాకును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందాల్సిన సేవలలో ఎలాంటి లోపాలు రాకుండా చూసుకోవాలని, చిన్నారుల ఆలనాపాలనాతోపాటు ఆటపాటల విద్య అందించాలని ఆదేశించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి వెంట ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ భవనంలో కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు మాదిరిగా పురపాలక ఉపాధ్యాయులకు కూడా చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పోస్టులను హేతుబద్ధీకరణ చేసి ప్రభుత్వ ఉపాధ్యాయులు పొందుతున్న అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. పురపాలక ఉపాధ్యాయులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు. ఎస్టీయూ పట్టణ అధ్యక్షుడు రవి, నాయకులు భీమరాజ్, లోక్యానాయక్, జంబులయ్య, ప్రహ్లాద, సుధాకర్ బాబు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా విశ్వలింగేశ్వర స్వామి ప్రభోత్సవం



స్వామివారి ప్రభోత్సవంలో భక్తులు

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో వెలసిన శ్రీవిశ్వలింగేశ్వర స్వామి ప్రభోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజామున ఆలయ అర్చకులు స్వామివారికి జలాభిషేకం, రుద్రాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజ, హోమాలు, మహా మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రభోత్సవంపై స్వామివారి మూలవిరాట్‌ను కొలువుంచి మేళతాళాలు డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు.

గోనెగండ్లకు చేరిన ఎల్లెల్సీ నీరు



ఎల్లెల్సీ నుంచి జీడీపీలోకి వదిలిన నీరు

గోనెగండ్ల: తుంగభద్ర దిగువ కాలువ నీరు గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు మంగళవారం ఉదయం చేరుకుంది. దీంతో ఎల్లెల్సీ నీటిని జీడీపీ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టులోకి మళ్లించారు. ఈ సందర్భంగా ఏఈ మహమ్మద్ అలీ మాట్లాడుతూ.. గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు దాదాపు 239 క్యూసెక్కుల నీరు వస్తోంది. తాగునీటి అవసరాల కోసం ఆ నీటిని ఎస్కేప్ ఛానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టుకు మళ్లిస్తున్నట్లు తెలిపారు. జీడీపీలో ప్రస్తుతం 0.8 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ప్రాజెక్టు ద్వారా డోన్, పత్తికొండ, దేవనకొండ తదితర పట్టణాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఎల్లెల్సీ కాలువ ద్వారా నీటిని జీడీపీలోకి మళ్లించినట్లు తెలిపారు. అలాగే కర్నూలు పట్టణానికి తాగునీటి అవసరాల కోసం జీడీపీ నుంచి 40 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు తెలిపారు. ఎవరైనా జలచౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నపై దాడి చేసిన తమ్ముడు అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో ఈనెల 24వ తేదీన రాత్రి అన్న తాహెర్‌వలీపై తమ్ముడు దాదా హుసేన్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఘటనపై తండ్రి ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం దాదా హుసేన్‌ను అదుపులోకి తీసుకుని, విచారించినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపారు. గత శనివారం అర్ధరాత్రి తాహెర్‌వలీ ఇంట్లో నిద్రిస్తుండగా తమ్ముడు దాదాహుసేన్ ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దాదాహుసేన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

చిరుత దాడిలో గొర్రె మృతి



మృతి చెందిన గొర్రె

కోసిగి: మండల పరిధిలోని నేలకోసిగి గ్రామానికి చెందిన చింతకుంట తిక్కమ్మకు చెందిన గొర్రెపై సోమవారం రాత్రి చిరుత దాడి చేసింది. ఆమె గ్రామ శివారులోని కొండ పక్కనే గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తోంది. రాత్రి ఇంటిముందు కట్టేసిన గొర్రెపై చిరుత దాడి చేసింది. శబ్దం విన్న కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో గొర్రెను అక్కడే వదిలేసి వెళ్లింది. పశువైద్యాధికారి అశోక్‌కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనురాధ, అసిస్టెంట్ శంకర్ నాయక్ గొర్రె కళేబరానికి పోస్టుమార్టం చేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వేలంపాటలో రూ.13 లక్షల ఆదాయం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ రంగనాథస్వామి దేవాలయం ఆవరణలో తలనీలాలు పోగుచేసుకునే హక్కులు, టెంకాయల విక్రయ హక్కులకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. తలనీలాల హక్కులను అనంతపురంకు చెందిన ఎం.మారెన్న రూ.12.75 లక్షలకు, టెంకాయల విక్రయ హక్కులను రూ.32 వేలకు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ శెట్టి సొంతం చేసుకున్నారు.

సురక్షలో 453 మందికి వైద్య పరీక్షలు



దుద్ది గ్రామంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

కోసిగి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా దుద్ది సచివాలయం పరిధిలోని దుద్ది, కొల్మాన్‌పుటలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు నజీర్ అహ్మద్, రజిత ఆయా గ్రామాల్లోని 453 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి కర్నూలుకు రెఫర్ చేశారు. కంటి అద్దాలు అందించేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో కొల్మాన్‌పేట సర్పంచ్ గుళిగేని జయరామ్, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, సూపర్‌వైజర్ రాముడు, హెల్త్ అసిస్టెంట్ కృపానందం, బలరాం, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.